
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 134 వ భాగం

## సూర్య వంశం – 2; సుద్యుముడు

క్రితం వ్యాసంలో మనువు, కొడుకు కోసం యజ్ఞం చేస్తే ఆయన భార్య కూతురే కావాలని హోతని అడగడం, ఆ హోత హోమ ద్రవ్యాన్ని యజ్ఞం లో వేసి కూతురు పుట్టాలి గాక అన్నందువల్ల ఇల అనే కూతురు పుట్టిందని చదివాం. రాజుకి పుట్టబోయేది కొడుకైతే రాజ్యం చేయడానికి వారసుడుంటాడని ఆశ. అయితే రాణికి మొదటి కాన్పులో కూతురుంటే మంచిది అనిపించడం సహజం కదా? అంతే గానీ ఈ భాగవతం అంతా మగవాళ్ళకే, ఇందులో ఆడవారికేం లేదు; ఆడవాళ్ళందర్నీ ఇలాగే వివక్షతో పెంచుతారు అనుకోకూడదు. ఎందుకంటే ముందు కధలో చదివినట్టూ దక్షుడికి కూతుర్ల వల్లే ప్రయోజనం కలిగింది; ఆయనకి వరసగా కొడుకులు పుట్టినప్పుడు వాళ్ళందర్నీ నారదుడు తపస్సుకేసి మళ్ళీస్తూ ఉంటే. అది అలా ఉంచి కధలోకి వద్దాం.

వ. అని పలికి భగవంతుండగు వసిష్ఠుండు గీర్తితత్పరుండు గావున మనువు కూఁతు మగతనంబు కొఱకు నేక
చిత్తంబున నాదిపురుషుం డగు హరిం బొగడిన నప్పరమేశ్వరుండు మెచ్చి, తపసి కోరిన వరం బిచ్చె; నది
నిమిత్తంబుగా నిలాకన్యక సుద్యుముండను కుమారుండయి రాజ్యంబు చేయుచు. [9-15]

వసిష్టుడు చెప్పాడు కదా మనువుతో, నా శక్తీ తపోబలం చూపిస్తాను అని. ఆయన సాక్షాత్తూ భగవంతుడి అవతారం, మాటతప్పని వాడూ కనక ఈ అమ్మాయి మగవాడిగా అవడానికి విష్ణువుకోసం ప్రార్ధన చేసాడు. విష్ణువు సంతోషించి, సరే ఈవిడ మగవాడు అవుతుంది అని వరం ఇచ్చాడు. ఇల అనే పేరుతో పుట్టిన ఆవిడ సుద్యుముడు అనే పేరుతో మగవాడుగా మారి, రాజ్యానికి వచ్చాడు. అయితే మొదట చేసిన యజ్ఞం బాగా బలమైనదనే కారణం, మరో కారణం ప్రకారం కర్మ అనేది ఎవరూ తప్పించుకోలేనిది అని గుర్తుపెట్టుకోవాలి.

సీ. ప్రొద్దు పో కొకనాఁడు పోయి, పేరడవుల
వెంట వేఁటాడుచు, వేడ్కతోడఁ
గొందఱు మంత్రులుగూడ రా, సైంధవం
బయిన గుఱ్ఱము నెక్కి, యందమైన
బలువిల్లుఁ గ్రొవ్వాడి బాణంబులును దాల్చి
పెను మెకంబులవెంట బిఱుసుతోడ
నుత్తరదిశను మహోగ్రుఁడై చనిచని
మేరువు పొంతఁ గుమారవనముఁ [9-16]

తే. జేరె నందు మహేశుండు శివయు నెపుడు
రతి సలుపుచుందు; రందుఁ జొరంగఁ బోవ
నాఁడుదయ్యెను రాజు; రాజానుచరులుఁ
బడఁతులైరి; తదశ్వంబు బడబ యయ్యె. [9-16.1]

ఈ సుద్యుముడు ఓ రోజు వేటకి వెళ్ళాడు మంత్రులతో, మందీ మార్బలంతో. అలా చాలా దూరం వెళ్ళి, మేరు శిఖరానికి దగ్గిరలో కుమారవనం అనేచోటకి చేరారు. అయితే అది పార్వతీ పరమేశ్వరుల (మహేశుడు, శివ) నివాసం. అందులో అడుగుపెట్టిన వెంఠనే రాజు ఆడదానిగా, రాజు కూడా ఉన్న అనుచరులు ఆడవారిగా (పడతులైరి) మారిపోయారు. ఆఖరికి వాళ్ళు ఎక్కిన మగ గుర్రాలు కూడా ఆడ గుర్రాలైపోయాయి (తదశ్వంబు బడబ యయ్యె). ఇదే కదా కర్మ అంటే, రాజు ఆడదానిగా పుట్టాలని ఉంది హోత చేసిన తప్పు ప్రకారం. కానీ భగవంతుడు కొంత తప్పించాక మరోసారి ఈ కర్మ తగులుకుంది. రామకృష్ణులు అనేది కూడా ఇదే. కర్మ పూర్తిగా తప్పించడం ఎవరికైనా సరే అసాధ్యం. మొంతలో కొంత తగ్గవచ్చు కానీ అనుభవించవల్సిందే.

వ. ఇట్లు మగతనంబు చెడి మగువలై యొండొరుల మొగంబులు చూచి మఱుఁగుచుండి" రనిన విని శుకునకు
రాజిట్లనియె. [9-17]

ఆ. రాజుఁ దోటివారు రమణు లై రంటివి;
కాంత లగుట యేమి కారణమున?
నిట్టి దేశ మెఱుఁగ మెన్నఁడు; నా కథల్
వేడ్కదీర నాకు విస్తరింపు. [9-18]

ఇలా ఆడవాళ్ళైపోయిన అందరూ ఒకరి మొహం ఒకరు చూసుకుని కంగారు పడుతున్నారు. ఇంతవరకూ కథ విన్న పరీక్షిత్తు శుకుణ్ణి అడుగుతున్నాడు – సుద్యుముడుగా అయిన రాజు మొదట్లో ఇల అనే ఆడపిల్లగా పుట్టాడు కనక పెద్దయ్యాక ఎప్పుడో ఇలా ఆడదానిగా మరోసారి మారాడంటే అర్ధం చేసుకోవచ్చేమో, కానీ రాజు కూడా ఉన్నవాళ్ళకి ఏమీ శాపాలు అవీ లేవు కదా? వాళ్ళు కూడా ఆడవారిగా అవడానికి ఏమిటి కారణం, ఇలాంటి కథ ఎప్పుడూ విన్నదీ కన్నదీ కాదు కదా? ఇలా మగ–ఆడ–మగ గా మారడం పరీక్షిత్తుకి తెల్సిన విషయమే, ఎందుకంటే మహాభారతంలో అర్జునుడు అజ్ఞాతవాసంలో బృహన్నలగా, అర్జునిడిగా మారడం అనే కథ తెల్సినవాడే కదా?

వ. అని యడిగిన నర్జునపౌత్రునకు వ్యాసపుత్రుం డిట్లనియె. [9-21]

ఇలా అడిగిన అర్జునుడి మనవడికి వ్యాసుడి కొడుకు చెప్తున్నాడు సమాధానం. ఈ వచనంలో అర్జునుడి సంగతి ఎందుకు రాసాడో గమనించారా? తన తాత అయిన అర్జునుడు బృహల్లగా మారడం మరో ఏడాది తర్వాత మళ్ళీ అర్జునుడిగా మారడం పరీక్షిత్తుకి తెలుసు. అందుకే అడిగాడు కూడా ఇలా మిగతా అందరూ ఆడవారిగా ఎందుకు మారారు అని. ఇది సందర్భానుసారంగా పోతన వాడిన వచనం.

క. ఈ నెల వెవ్వఁడు జొచ్చిన
మానిని యగు" ననిన తొంటి మాట కతమునన్,
మానవుఁడు మగువ పోఁడిమి
మానక పేరడవులందు మఱియుం దిరిగెన్. [9-24]

ఈ కుమారవనం అనేది పార్వతీ పరమేశ్వరులు ఉండేచోటు.  ఓ సారి మునులు శివుణ్ణి చూడ్డానికి వెళ్ళినప్పుడు శివుడు శాపం పెట్టాడుట – ఇక్కడ మేము ఉండేది తపస్సూ, ఏకాంతం కోసం అందువల్ల ఇక్కడకి ఎవరొచ్చినా ఆడవారిగా మారిపోతారు అని. అందువల్ల ఈ సుద్యుముడు, ఆయన పరివారం అందరూ, గుఱ్ఱంతో సహా ఆడవాళ్ళైపోయారు.

వ. ఇట్లు చెలికత్తియల మొత్తంబులుం, దానును, నా రాచపూఁబోడి వాఁడిచూపుల నాఁడు పోడిమి నెఱపుచు, దైవయోగంబున సోమ సుతుండును, భగవంతుడును నగు బుధుని యాశ్రమంబు జేరి, మెలఁగుచున్న యెడ.

[9-25]

తిరిగి రాజ్యానికి వెళ్తే తల్లీ తండ్రీ ఏమంటారో తెలియదు కదా? అసలు గుర్తు పట్టగలరో లేదో కూడా; అందువల్ల అక్కడే తిరుగాడుతూ, దైవయోగం వల్ల చంద్రుడి కొడుకు (సోమ సుతుండును) బుధుడు అనే ఆయన ఆశ్రమంలో ఆయన నీడన చేరారు.

వ. ఇట్లలరువిల్తుని నెఱబిరుదు చిగురు టడిదంబు మొనకు నోహటించి, వారలిరువురుం బైపడి వేడుకలకుం జొచ్చిన, వారలకుం బురూరవుం డను కుమారుండు పుట్టెనివ్విధంబున. [9-27]

మళ్ళీ ఇల అనే అవిడగా మారిన తర్వాత బుధుడి వల్ల పురూరవుడు అనే కొడుకు పుట్టాడు. ఈ వచనంలో మొదటి పదాలు "ఇట్లలరువిల్తుని నెఱబిరుదు చిగురు టడిదంబు మొనకు నోహటించి" అర్ధమయ్యాయా? ఇట్లు, అలరువిల్తుడు – అలరు (అరవిందము మొదలైన) విలుతుడు (బాణాలు కలవాడు); నెరబిరుదు (మంచి శౌర్యముతో); అడిదంబు (బాకు); ఓహటించి (ఓడిపోయి). అంటే మన్మధుడు వేసిన బాణాలకి ఓడిపోయి ఇద్దరూ ఒకటయ్యారు. అసలు ఇలాంటి బాష భాగవతం రాసే పోతనకి ఎలా అందిందనేది మనం చెప్పలేం. అది అలా ఉంచి మన్మధుణ్ణి అలరవిల్తుడు అనడంలో విశేషం చూద్దాం. మన్మధుణ్ణి శివుడి తపస్సు చెడగొట్టడానికి వెళ్ళమంటే 'అబ్బే ఆయన కోపిష్టి' నేను వెళ్ళను అంటాడు. ఇంద్రుడితో సహా అందరూ వప్పించి పంపాక శివుడి మీద వేస్తాడు ఈయన బాణాలు. ఆ బాణాల పేర్లు – అశోకము, అరవిందము, చూతము, నవమల్లిక, నీలోత్పలం. మొదటి నాలుగూ పనికిరానప్పుడు ఐదో బాణం శివుణ్ణి గాయపరిచేసరికి మూడో కన్ను తెరుస్తాడు పరమేశ్వరుడు. ఆ తర్వాత మన్మధుడి భార్య కోరితే ఈయన నీకు తప్ప ఎవరికీ భౌతికంగా కనిపించడు కానీ చిరంజీవి అని వరం

ఇస్తాడు భోళా శంకరుడు. ఈ వచనంలో అరవిందము అనే బాణం పేరుతోనే పోతన వాడిన అలరువిల్తుడు అనే ప్రయోగం.

ఆ. మనుసుతుండు ఘనుఁడు మగనాలి తనమునఁ
గొడుకుఁ గాంచి, విసివి, కుందికుంది,
చింతఁ బొంది, గురు వసిష్ఠుని భావించె,
నతని తలఁపుతోన యతఁడు వచ్చె. [9-28]

అయితే కూతుర్ని కొడుకుగా మార్చుకోవడం కోసం మొదట్లో వసిష్టుడి దగ్గిరకి వెళ్ళిన రాజు (మనువు)కి ఇదేమిట్రా నాయనా ఇంతా కష్టపడితే కొడుకు మళ్ళీ కూతురు అయిందే అని మరోసారి వసిష్టుడి గురించి మనసులో భావించేసరికి ఆయన వచ్చాడు చూడ్డానికి.

వ. వచ్చి సుద్యుమ్నుండు మగవాఁడగు కొఱకు, నమ్మునిపుంగవుండు శంకరు నారాధింప, నీశ్వరుండును దపసి ప్రయాసంబునకు సంతసిల్లి, యిట్లనియె. [9-29]

మ. తను మున్నాడిన మాటయున్ నిజముగాఁ, దన్మౌనికిం బ్రీతిగా,
మనుజుండున్ నెల వో నెలం బురుషుఁడై, మాసాంతరంబైనఁ గా
మినియై, యీ గతి వీడు పాటమర భూమిం దాన రక్షించుఁ బొ
మ్మనినన్ వచ్చె వసిష్ఠుఁ; డా మనుసుతుండారీతి రాజ్యస్థుఁడై. [9-30]

ఈ సారి వసిష్టుడు శంకరుణ్ణే ఆరాధించాడు. అయితే ముందు చెప్పుకున్నట్టూ కర్మ అనేది తప్పదు. స్త్రీగా జన్మించాలని ఉంది కాబోలు. అందుకే శివుడు చెప్తున్నాడు వసిష్టుడు కూడా  వప్పుకునేటట్టూ – వసిష్టుడు రాజుకి మాట ఇచ్చాడు కనక అది జరిగేటట్టూ ఓ నెల పురుషుడిగా (వో నెలం బురుషుఁడై), కూమారవనంలో శివుడి శాపం పోకుండా ఉండేటట్టూ, నెల గడిచాక (మాసాంతరంబైన) స్త్రీగా (కామినియై) ఉంటూ రాజ్యం చేయాలి; దాంతో సరిపెట్టుకోండి. అలా మను సుతుడు రాజ్యం చేసాడు.

ఆ. మగువ యగుచు మరల మగవాఁడు నగుచును
భూతధాత్రి యంత నాతఁ డేలెఁ
బ్రజలు సంతసింప బాహాబలముతోడఁ
గురుని కరుణఁ జేసి కువలయేశ! [9-31]

అలా స్త్రీ అవుతూ, మరోసారి మగవాడు అవుతూ రాజ్యం చేసాడు. రాజ్యం బాగుంది కనక ప్రజలకి ఇందులో ఏమీ గొడవలేదుట. ఇదంతా ఎలా అంటారేమో అని చెప్తున్నాడు – వసిష్టుడంతటి గురువు కరుణ ఉంది కదా దానివల్ల మాత్రమే.

వ. అతనికి నుత్కళుండును, గయుండును, విమలుండును నను కొడుకులు మువ్వురు గలిగి, ధర్మపరులై యుత్తరాపథంబునకు రాజులైరి; సుద్యుమ్నుండు ముదుసలి యయి ప్రతిష్ఠానపురంబు విడిచి, పురూరవునకు భూమి నిచ్చి, వనంబునకుం జనియె; నివ్విధంబున. [9-32]

ఇంతవరకూ వచ్చాక మరో ముగ్గురు కొడుకులు – ఉత్కళుడు, గయుడు, విమలుడు అనేవారు పుట్టారు. అయితే వీళ్ళకి తల్లి ఎవరో చెప్పడం లేదు. ముందే బుధుడి వల్ల పురూరవుడు పుట్టాడు కదా? అలా పెద్దవాడికి తన రాజ్యం ఇచ్చి, మిగతా ముగ్గిరికీ ఉత్తరా పథంలో రాజ్యం ఇచ్చి ముసలివాడైపోయాక అడవులకి వానప్రస్థం వెళ్ళాడు. మిగతా సూర్యవంశ పరంపర వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS